క్లుప్తంగా

ఐదు రోజుల పాటు ఆధార్ శిబిరాలు

కడియం: మండలం పరిధిలోని 11 సచివాలయాల్లో ఈ నెల 27వ తేదీ వరకూ ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. 24న కడియపులంక 1, కడియపులంక 3, దుళ్ల 1, 25న వేమగిరి 4, జేగురుపాడు 1, దుళ్ల 1, 26న వేమగిరి 4, జేగురుపాడు 1, దామిరెడ్డిపల్లి, 27న కడియపులంక 4, కడియపులంక 3, దామిరెడ్డిపల్లిలోని సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. వేమగిరితోటలోని మురుగు కాలువల్లో నీటిని సెప్టిక్ ట్యాంకుల ద్వారా తోడి బయటకు తరలిస్తున్నామన్నారు. ఆయా పనులను మంగళవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వేమగిరితోట -1 స్కూల్‌ను సందర్శించారు. సీజనల్ వ్యాధులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. స్కూలు హెచ్‌ఎం జయరాజ్, జేసీ త్రిమూర్తులు ఉన్నారు.

మారుతి స్విఫ్ట్ కారు, టీవీ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: హెచ్‌డీ కార్ కన్సల్టెంట్ షోరూమ్‌లో సోమవారం రాత్రి మారుతి స్విఫ్ట్ కారు, 32 అంగుళాల ఎల్‌ఈడీ చోరీకి గురయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నక్కా శ్రీహరిబాబు స్థానికంగా హెచ్‌డీ కార్స్ కన్సల్టెంట్స్ షోరూమ్ నిర్వహిస్తున్నాడు. ఆయన ఈ నెల 22వ తేదీ రాత్రి యథాతథంగా షోరూమ్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చేసరికీ షోరూమ్ లోపల మారుతి స్విఫ్ట్ కారు, 32 అంగుళాల ఎల్‌ఈడీ మాయమయ్యాయి. అతడి ఫిర్యాదు మేరకు మంగళవారం బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు అన్నారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం 'రోడ్డు ప్రమాదాల నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపకూడదన్నారు. మోటార్ వెహికల్ చట్టంలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించారు. సదస్సులో జిల్లా రవాణా అధికారి కేఎస్‌ఎంవీ కృష్ణారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, జి.రామ్‌నారా యణ పాల్గొన్నారు.

వరి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


కడియం: ముంపునకు గురైన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నారు విత్తి ఏడు నుంచి 30 రోజుల వ్యవధిలో ఉన్న పంట ఐదు కంటే ఎక్కువ రోజులు మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. ఎంటీయూ 1232 రకం వరి విత్తిన 15 నుంచి 70 రోజుల వరకూ ముంపును తట్టుకుంటుందన్నారు. ముంపు చేలో నీటిని ఐదు రోజులలోపు బయటకు పోయే విధంగా చేసుకోవాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక గ్రాము కార్బండిజమ్ పిచికారీ చేయాలన్నారు. పిలకల దశలో సాధారణ రకాల వరి ఐదు రోజుల వరకూ నీట మునిగినా బతికే అవకాశం ఉందని తెలిపారు. పిలకల దశలోని వరిపొలం నుంచి నీటిని బయటకు పంపిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను అదనంగా వేయాలని సూచించారు. అలాగే రెండు గ్రాముల కార్బండిజమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే గ్రామ సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

గైట్‌లో చిత్రలేఖనం పోటీ

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల గ్రంథాలయంలో ప్రకృతి సంరక్షణపై విద్యార్థులకు మంగళవారం పోటీలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మేరీ లైఫ్‌లో భాగంగా పర్యావరణ హితజీవనశైలిపై అవగాహన కలిగించే విధంగా ఈ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. పర్యావరణ పరిక్షణ వలన కలిగే ప్రయోజనాలు, లేకుంటే ఎదురయ్యే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులు పలు చిత్రాలను గీశారన్నారు. పి.సింధు ప్రథమ, కె.షామిని ద్వితీయ, ఎస్.ఉమ తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు.

భారీ వర్షం.. అపార నష్టం

- ఐదురోజులుగా ముంపులోనే వరిచేలు
- అన్నదాతల ఆవేదన
- రూరల్ నియోజకవర్గంలో 1421.54 హెక్టార్ల మునక



వెంకటనగరం గ్రామంలో మోకాళ్ల లోతు నీటిలో వరిచేలు

రాజమహేంద్రవరం రూరల్: అధిక వర్షాలు, గోదావరి వరద రైతులను తీవ్రంగా దెబ్బ తీశాయి. వరి పొలాలు మోకాళ్లలోతు నీట మునిగాయి. ముంపుతో వరినాట్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. రైతుల కష్టం, పెట్టుబడి నీటి పాలయ్యాయి. పంట కాలువలలో పూడికలు తీయకపోవడంతో నీరు ముందుకు లాగలేదు. దీంతో పంట చేలు చెరువుల్లా మారాయి. నియోజకవర్గంలోని కడియం మండలంలో 1,951, రూరల్ మండలంలో 1,430 హెక్టార్లలో వరి సాగు జరుగుతుండగా, ఇప్పటి వరకూ కడియం మండలంలో 1842.47, రూరల్ మండలంలో 1326.18 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. రైతులు ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకూ పెట్టుబడి పెట్టారు.

1451.54 హెక్టార్లలో పంటనష్టం

కొద్ది రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు, గోదావరి వరద ఉధృతితో పల్లపు ప్రాంతాలలోని వరిచేలు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి నీరు నిలిచిన చేలల్లో వరినాట్లు ఎందుకు పనికి రాకుండా పోయే పరిస్థితి నెలకొంది. కడియం మండలంలోని కడియం ఆవతో పాటు, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, వీరవరం, దామిరెడ్డిపల్లి, దుళ్ల, వేమగిరి, కడియపుసావరం గ్రామాల్లో 977.4 హెక్టార్లలో అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని తొర్రేడు, వెంకటనగరం, కాతేరు, కోలమూరు, ధవళేశ్వరం, బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లోని 444.14 హెక్టార్లలో వరి చేలు నీటమునిగాయి. వరినారు కొనడంతో పాటు ఇతర వాటికి రైతులకు ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకూ ఖర్చు పెట్టారు. గతేడాది ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలకు ధరలు బాగుండటంతో ఈ సారి కౌలు ధరలు కూడా పెరిగాయి.



కడియం ఆవ ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలు

పూడికతీతలో జాప్యం

ఏటా వేసవి సీజన్‌లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనుల పేరుతో పంట కాలువలకు మరమ్మతులు చేపడతారు. అయితే సార్వత్రిక ఎన్నికలు, అనంతరం ఫలితాలు, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పంటకాలువల్లో పూడికలు తీయకపోవడంతో రైతులు నష్టానికి ఇదొక కారణమని చెబుతున్నారు.

అయోమయంలో రైతులు

అకాల వర్షాలు రైతులకు అయోమయానికి గురిచేశాయి. ప్రస్తుతం చేలల్లోని వర్షపునీరు బయటకు పోయేందుకు ఎన్ని రోజులు పడుతుందో అర్థం కాని పరిస్థితి. వరినాట్లు పనికి రాకుండా పోతే కూడా ఏమి చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నష్టపోయిన ప్రతి ఎకరాకు పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. అలాగే పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వెంకటనగరం గ్రామంలో ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరినాట్లు వేశాను. అధిక వర్షాలతో పొలంలో మోకాళ్ల లోపు నీరు చేరింది. నాట్లన్నీ మునిగిపోయాయి. దాదాపు రూ.80 వేల వరకూ నష్టం వచ్చింది. రైతులను ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలి.

– **ఉప్పులూరి ప్రసాద్**, కౌలురైతు, తొర్రేడు

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు



సత్తిబాబు వ్యవసాయ క్షేత్రంలో అధికారులు, రైతులు

కడియం: ప్రకృతి వ్యవసాయం విధానం వల్ల రైతులకు, పర్యావరణానికి అన్ని విధాలా మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు అన్నారు. అటల్ బుజల్ యోజనా పథకంలో భాగంగా మండలంలోని మురమండలో మరిడి సత్యనారాయణకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ మహబూబ్‌వలీ, డీడీహెచ్ శ్రీనివాసులు సందర్శించారు. వీరితో పాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ శాఖల అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు విధానం, పంట దిగుబడి, పెట్టుబడి తదితర విషయాలను సత్తిబాబు వారికి వివరించారు. ప్రకృతి సాగులో వినియోగించే బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాన్ని తెలియజేశారు. పాడి పరిశ్రమతో పాటు ప్రకృతి విధానంలో తాను సాగు చేస్తున్నానని సత్తిబాబు వారికి వివరించారు. అనంతరం గోమూత్రం, గో పేడ వంటి వాటితో తయారు చేస్తున్న ధూప్‌స్టిక్స్, దేవుని ప్రతిమలు, దీపపు కుందుల వంటి వాటిని ప్రదర్శించారు. రైతు సత్తిబాబు కృషిని వారు అభినందించారు.

శాంతించని గోదావరి

- కొనసాగుతున్న వరద ఉధృతి
- ముంపులోనే పొలాలు
- అధికారుల అప్రమత్తం

రాజమహేంద్రవరం సిటీ: గోదారమ్మ ఉగ్రరూపం తగ్గలేదు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తోంది. నది ఉధృతి మంగళవారం కూడా కొనసాగింది. గోదావరి మధ్యలో లంకలలో ప్రజలకు అధికారులు నగరంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి అక్కడ అన్ని వసతులు కల్పించారు.

లంకల్లోకి చేరిన వరద

కడియం: కడియపులంక వద్ద లంకల్లోకి గోదావరి వరద చేరింది. ఎగువన నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో లంకల్లోకి మరింతగా వరద నీరు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కడియపులంక నుంచి దిగువన పొట్టిలంక వదరకు ఏటిగట్టును ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో లంకల్లోకి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం కడియపులంక పరిధిలోని కూరగాయలు, పూలతోటలు, నర్సరీ మొక్కలు నీట మునిగాయి. తెల్లవారేసరికి నీటి మట్టం మరింత పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు.



రోడ్డు కమ్ రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా గోదావరి ప్రవాహం

ముంపు ముప్పుతో ముందస్తు చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద గేట్లు మూతపడ్డాయి. దీంతో నగరం నుంచి హుకుంపేట, బొమ్మూరు మీదుగా వెళ్లే నీరు వెనక్కి వస్తోంది. ఇప్పటికే కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో మండల స్థాయి, పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. హుకుంపేట పంచాయతీ పరిధిలోని సావిత్రీ నగర్ ప్రాంతంలో అపార్టుమెంట్లు వద్దకు నీరు చేరింది. ఈవోపీఆర్అండ్ ఆర్డీ దాకారపు బాబూరావు, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, టీడీపీ నాయకులు బొప్పన నానాజీ, దుద్దుపూడి రమేష్ తదితరులు మోటర్లు పెట్టి నీటిని కాలువలోకి తోడించారు. ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద భారీ మోటార్లతో నీటిని తోడిస్తే తప్ప బొమ్మూరు, హుకుంపేట గ్రామాలు ముంపు సమస్య నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదు.



కడియపులంక నీట మునిగిన నర్సరీలు, ఉద్యాన పంటలు



రాజమహేంద్రవరంలో గోదావరి ఉధృతి



హుకుంపేటలో మోటార్‌తో ముంపు నీటిని తోడుతున్న సిబ్బంది

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తేజస్వినిని సత్కరిస్తున్న రామ్‌కిరణ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ప్రముఖ వైద్యులు గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు.బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, పేరెంట్స్ కమిటీ ఉపాధ్యక్షురాలు పితాని మీనా అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పదోతరగతి పరీక్షల్లో 591 మార్కులతో జిల్లా ప్రథమస్థానం సాధించిన కాసాని తేజస్విని, 590 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన వెంకట సత్యసాయిసింధులను మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ సౌజన్యంతో గోరంట్ల రవిరామ్‌కిరణ్ శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి, మాజీ ఎంపీటీసీ పలివెల సత్యనారాయణ, కామిని భాస్కర్, భీమరశెట్టి రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- రూ.3.50 లక్షల సొత్తు స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

కడియం: పలుచోట్ల చోరీలకు పాల్పడిన ముగ్గురిని కడియం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మంగళవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. కడియం రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని మంగళవారం పోలీసులు గమనించి, అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేయగా కడియంలోని సెల్‌ఫోన్‌షాప్‌లో దొంగతనం చేయడంతో పాటు, ఇదే గ్రామంలో ఒక ఆటో, కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఒక ఆటో, పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటారు బైకును దొంగిలించినట్లు అంగీకరించారు. వారినుంచి రూ.3,50 లక్షల విలువైన రెండు ఆటోలు, మోటారు సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రాజమహేంద్రవరంలోని నారాయణపురానికి చెందిన వడ్డాది దుర్గాప్రసాద్‌ను కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. మిగిలిన ఇద్దరూ మైనర్లు కావడంతో జువెనైల్ కోర్టు ద్వారా జువైనల్ హోమ్‌కి తరలించారు. చోరీలపై నిఘా పెట్టి నిందితులను పట్టుకున్న ఎస్సై బి.నాగదుర్గా ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ సురేష్ బాబు, కానిస్టేబుళ్లు లక్ష్మణ్, రవికుమార్, ప్రసన్న కుమార్‌ను అభినందించారు.

ఆక్యుప్రెజర్‌తో అద్భుత ఫలితాలు



ఆక్యుప్రెజర్ సేవలు అందిస్తున్న రాజస్థాన్ వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: నేచర్ క్యూర్ పద్ధతికి చెందిన ఆక్యుప్రెజర్ వైద్య విధానంలో అద్భుత ఫలితాలు వస్తున్నాయని రోటరీ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్, ప్రముఖ ఆడిటర్ విశ్వనాథం భాస్కరరామ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో నిర్వహిస్తున్న ఆక్యూప్రెజర్ థెరపీ వైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. క్లబ్ సెక్రటరీ కనకం చంద్రశేఖరరావు మాట్లాడుతూ జూలై 25 వరకూ ఉదయం 8 నుంచి 12 వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల శిబిరం జరుగుతుందన్నారు. రాజస్థాన్ చెందిన ఆక్యూప్రెజర్ థెరపిస్ట్ డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి, థెరపిస్ట్ డాక్టర్ రేవంత్ చౌదరి అందిస్తున్న వైద్య సేవలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ 200 మందికి ఈ వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేశామని, ఇప్పటి వరకూ 550 మందికి వైద్యసేవలు పొందారన్నారు. కార్యక్రమంలో రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు, అసిస్టెంట్ గవర్నర్ పీవీఎస్ఎస్ దొరబాబు, లంకలపల్లి శ్రీనివాసరావు, సుంకర నాగేంద్ర కిషోర్, ఇనమర్తి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో వసతుల పరిశీలన



పునరావాస కేంద్రంలో మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఎదుర్లమ్మలంక, కేతావారిలంకకు చెందిన 248 మంది ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఈ సందర్భంగా వారితో కలెక్టర్ మాట్లాడారు. భోజనం, వసతి తదితర ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతి తగ్గే వరకూ శిబిరంలో ఉండాలని, అధికారులు, సిబ్బందికి సహకరించాలని వరద బాధితులకు సూచించారు. శానిటరీ నిర్వహణలో అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికీ వేడి నీళ్లు అందించడం, మహిళలకు, పురుషులకు ప్రత్యేక వసతి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట రెవెన్యూ, నగరపాలకసంస్థ సిబ్బంది, వార్డు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం



శిక్షా సప్తాహ్‌లో మాట్లాడుతున్న ఏఎంవో గౌరీ శంకర్

కంబాలచెరువు: సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ సులభమవుతుందని జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీ శంకర్ అన్నారు. స్థానిక నారాయణపురం మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో రెండోరోజు మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎంను పరిశీలించారు. విద్యార్థుల కృత్యాలను చూసి, అభినందించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా శిక్షా సప్తాహ్ విద్యా వారోత్సవాలను ఈ నెల 29 వరకూ నిర్వహిస్తున్నట్టు ఏఎంవో తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆర్టీఓ కార్యాలయం, వాటర్ ట్యాంక్, గాంధీపురం, నారాయణపురం, మేనకా బార్, ఆంధ్రాబ్యాంక్, సుబ్బారావు పేట, ఎస్‌బీఐ కాలనీ, సుబ్రహ్మణ్యం నగర్, సైక్లోన్ కాలనీ ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

వెన్నెముక బాధితుడికి వీల్‌చైర్ వితరణ



బాధితుడికి వీల్‌చైర్ అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, చిత్రంలో దాతలు కల్యాణి, భీమేశ్వరరావు

కంబాలచెరువు: వెన్నెముక విరిగిపోయి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఆస్పత్రి ఉద్యోగులు అండగా నిలిచారు. తమ సొంతఖర్చుతో వీల్‌చైర్ కొనుగోలు చేసి అతడికి అందజేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ చేతుల మీదుగా మంగళవారం ఆసుపత్రిలో వీల్ చైర్‌ను అందించారు. రాజానగరం మండలం పరిజల్లిపేట గ్రామానికి చెందిన 25 ఏళ్ల సిద్ద శ్రీనివాస్ ఐదు నెలల క్రితం ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. అప్పులు చేసి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మంచానికే పరిమితం కావడంతో శరీరం వెనుక భాగం కుళ్లిపోయి తీవ్రగాయమైంది. చర్మం ముక్కలుగా ఊడిపోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. శ్రీనివాస్ భార్య ఐదు నెలల గర్భవతి. అతడికి ఆస్పత్రిలో సేవలు చేస్తోంది. కాగా.. శ్రీనివాస్‌ను ఆరు బయట తిప్పితే గాయాలు మానే అవకాశాలు ఉంటాయని అతడికి వైద్య సేవలు అందిస్తున్న సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హేమంతి చెప్పారు. శ్రీనివాస్ పరిస్థితిని చూసి చలించిన ట్రైనీ స్టాఫ్ నర్స్ పి.కల్యాణి, ఎంఎన్‌వో ఆర్వోజే భీమేశ్వరరావు తమ సొంత ఖర్చులతో వీల్ చైర్‌ను సమకూర్చి అతడికి అందజేశారు. పి.కల్యాణి, భీమేశ్వరరావులను డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్ అభినందించారు.

ఆర్యాపురం బ్యాంకు అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. ఈ నెల 20న జరిగిన బ్యాంకు ఎన్నికలలో ఆయన ప్యానల్ సభ్యులు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు సమావేశమై చైర్మన్‌గా శంకరరావును, వైస్ చైర్మన్‌గా పోలాకి పరమేశ్వరరావును ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శంకరరావు మాట్లాడారు. తాను 2019 వరకూ బ్యాంకుని ప్రగతి పథంలో నడిపించానన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు పాల్గొన్నారు. నూతన పాలక వర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, అలాగే వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

సాక్షి - సినిమా



శ్యామల :	భారతీయుడు-2
సూర్యమినీ :	బ్యాడ్‌న్యూస్
సూర్యప్యాలెస్ :	భారతీయుడు-2
స్వామి :	ట్విస్టర్స్
అశోక :	కల్కి2898ఏడీ
శివజ్యోతి :	పేకమేడలు
అనుశ్రీ :	డార్లింగ్
రంభ :	క్రైమ్‌రియల్
ఊర్వశి :	డీమోంటీ కాలనీ
కుమారి :	నరబలి
అప్సర :	కల్కి2898ఏడీ
నామవరం	
వీఎస్ మహల్ :	డార్లింగ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	కల్కి2898ఏడీ
కడియం	
వెంకటసూర్య :	డార్లింగ్